సాక్షి పెద్దపల్లి

సోమవారం । 26 । జూన్ । 2023



మల్లన్న సన్నిధిలో భక్తుల రద్దీ

ఓదెల: మల్లన్న స్వామి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. కోడె మొక్కులు, ఒగ్గు పూజారులతో స్వామివారికి పట్నాలు వేయించారు. బోనాలు చేసి నైవేద్యంగా సమర్పించారు.



అపర భద్రాద్రిలో భక్తుల రద్దీ

ఇల్లందకుంట: ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/26.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ట్రినిటి ప్లేస్‌మెంట్‌లో 160మందికి ఉద్యోగాలు



నియామక పత్రాలు అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ట్రినిటి ఇంజినీరింగ్ కాలేజీలో రెండురోజులుగా సాగిన ఆన్ క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో 160మందికి ఉద్యోగావకాశాలు దక్కాయని అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. ఆదివారం ముగింపు కార్యక్రమంలో ఉద్యోగాలు పొందిన పలువురికి మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి నియామక పత్రాలు అందించారు. ఉద్యోగాలు పొందిన వారందరినీ అభినందించారు. ప్రిన్సిపల్ గణేశ్, ఏఓ సురేశ్, హెచ్‌ఓడీలు ఆరిఫ్, నటరాజన్, కౌసల్య, స్వాతి, ప్రభాకర్, రామ్మోహన్, చొప్పరి వంశీ తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన నాయకులు



కండువా కప్పుతున్న ఎంఎస్ రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: స్థానిక సప్తగిరికాలనీకి చెందిన పలువురు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరినవారిలో స్థానిక యువకులు, మహిళలు ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు మహంకాళిస్వామి, ఎండీ.ముస్తఫా, మారెల్లి రాజిరెడ్డి, గట్ల రమేష్, నజీం పాల్గొన్నారు.

సుద్దాలలో గడపగడపకూ కాంగ్రెస్



సుద్దాలలో గ్రామస్తులను పలకరిస్తున్న విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం సుద్దాలలో గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు ఇంటింటికీ తిరిగి గ్రామస్తులను పలకరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేస్తే పథకాల గురించి వివరించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



మండలపరిషత్ ఆవరణలో సమావేశమైన నాయకులు

పెద్దపల్లిరూరల్: ఈ–కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లాకేంద్రంలో సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయ బదిలీ, పదోన్నతుల వ్యవహారంపై కోర్టులో స్టే ఎత్తివేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యాసపౌర్ణమి సందర్భంగా గురుపూజోత్సవం నిర్వహించాలన్నారు. నాయకులు శ్రీనివాసరావు, విజయేందర్‌రెడ్డి, కనకయ్య, రామేశ్వర్, ఉమాపతిరెడ్డి, దిలీప్, రఘోత్తంరెడ్డి తదితరులున్నారు.

ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్దన్ డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికుల నిరసనకు మద్దతు తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయకుండా.. కేవలం ఓటు బ్యాంక్‌గా చూడడం సరికాదన్నారు. పారిశ్రామిక ప్రాంత ఎమ్మెల్యేలు, ఎంపీ జోక్యం చేసుకుని యాజమాన్యం, ప్రభుత్వంతో చర్చలు జరిపి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఎన్టీపీసీ కార్మికుల శ్రమతో నేడు అనేక అవార్డులు పొంది గుర్తింపులోకి వచ్చిందన్నారు. ఎన్టీపీసీ యాజమాన్యం స్పందించి, కాంట్రాక్ట్ కార్మికులతో శాంతియుత వాతావరణంలో చర్చలు జరపాలని కోరారు.

- వచ్చేనెల 3 వరకూ మార్పులకు అవకాశం
- కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారు 18,224
- గత సీజన్ వరకు లబ్ధిదారులు 1,37,861
- నేటి నుంచి రైతుల ఖాతాల్లోకి..



కొత్త పట్టాదారుకు రైతుబంధు

సుల్తానాబాద్: కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన వారికి ఈ వానాకాలం సీజన్ నుంచి రైతుబంధుకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇలా జిల్లాలో గతేడాది జూన్ నుంచి ఇప్పటివరకు 18,224 మంది రైతులు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందారు. వీరితో పాటు ఇంతకుముందున్న లబ్ధిదారులందరికీ ఈనెల 26 నుంచి రైతుబంధు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. ఎకరాకు రూ.5వేల చొప్పున ముందుగా 10గుంటలు మొదలు.. 20 గుంటలు, ఎకరం వరకు విస్తీర్ణం పెంచుకుంటూ పోనున్నారు. మరోవైపు ఈసారి జిల్లాలో పోడుభూములకూ కొత్తగా పట్టాలు వస్తుండటంతో వారికి కూడా పథకాన్ని వర్తింపజేసేందుకు యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. గత సీజన్‌లో ఎస్సారెస్పీ భూములు, కోర్టు కేసులు ఉండడంతో వారికి రైతుబంధు జమ కాలేదు. అవి పరిష్కారం కావడంతో వాటికి కూడా రైతుబంధు ఇచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ లెక్కన ఈ సీజన్‌లో రైతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

కొత్తవారు ఇలా..

కొత్తగా భూములు కొన్నవారు.. అన్నదమ్ముల మధ్య భూమి పంపకాలు చేసుకుని కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందారు. వీరంతా రైతుబంధుకు అర్హులు కానున్నారు. వీరికోసం వ్యవసాయశాఖ లాగిన్‌లో అవకాశం ఇచ్చారు. రైతులు ఏఈఓలకు దరఖాస్తులు ఇచ్చి రైతుబంధు కోసం తమ పేర్లను నమోదు చేసుకున్నారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో జరిగే పట్టాలు(రిజిస్ట్రేషన్‌లు) ధరణి నుంచి పూర్తిగా సీసీఎల్ఏకు వెళ్తాయి. అక్కడ నుంచి వ్యవసాయశాఖ కమిషనరేట్‌లోని రైతుబంధు విభాగానికి వెళ్తాయి. వారు కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతుల వివరాలను నేరుగా ఏఈవోల లాగిన్‌కు పంపిస్తారు. ఏఈవోలు సంబంధిత రైతుల ఖాతా నంబర్‌లను నమోదుచేసి పంపిస్తారు.

ఖాతా మార్పులకు అవకాశం

రైతులు తమ బ్యాంకు ఖాతాను రైతుబంధుకు అనుసంధానం చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రతి సీజన్‌లో రైతుబంధు నిధులు జమ చేయడానికి నెలరోజుల ముందుగానే ఈ అవకాశం (ఆప్షన్) ఇస్తున్నారు. ఇప్పుడు సైతం ఏఈవోలకు రైతుబంధు పోర్టల్‌లో నమోదైన వివరాలను నమోదు చేసి ఖాతా నంబర్ల మార్పులకు వీలు కల్పించింది. రైతులు తమ పాత బ్యాంకు ఖాతాను మార్చుకుని కొత్తది నమోదు చేయాలనుకుంటే వెంటనే ఏఈవోల వద్ద దరఖాస్తు చేసుకోవాలి. ఈనెల 16 వరకు వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ అయి ఉండాలి. పట్టా పాసు పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్, బ్యాంకు సేవింగ్ ఖాతా, దరఖాస్తులో వివరాలు నమోదు చేసి ఏఈవోకు అందివ్వాలి. అయితే గత సీజన్లో ఐదెకరాలకు పైగా ఉన్న రైతులకు రైతుబంధు సహాయం నేటికీ జమ కాలేదు. దీంతో రైతులు రెవెన్యూ, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వారికి రైతుబంధు విషయమై ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అర్హుల జాబితాను హైదరాబాద్‌లోని సీసీఎల్ కార్యాలయానికి పంపించామని, అక్కడి నుంచి డబ్బులు పడతాయని, తమకు ఎలాంటి సంబంధమూ ఉండదని అంటున్నారు. వారికి ఈ సీజన్‌లోనైనా సొమ్ములు అందేనా అని రైతులు ఎదురుచూస్తున్నారు.

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం

లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. సంబంధిత ధ్రువపత్రాలు ఏఈవోలకు అందజేయాలి. రైతుబంధు సాయం లబ్ధిదారుల సంఖ్య పెరుగుతుంది. ప్రభుత్వ మార్గదర్శకాల ఆధారంగానే ఈ నెల 26 నుంచి పంపిణీ ఉంటుంది. జూలై మూడో తేదీ వరకు మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

అధికార పార్టీ కార్పొరేటర్ల అసమ్మతి గళం

- పోటాపోటీగా క్యాంపులు
- మేయర్, డిప్యూటీ మేయర్ తీరుపై కినుక
- పనులు కావడం లేదని ఆగ్రహం



సమావేశమైన కార్పొరేటర్లు

గోదావరిఖని: రామగుండం కార్పొరేషన్‌లో అధికార పార్టీ కార్పొరేటర్లు అసమ్మతి గళం వినిపిస్తున్నారు. తమ డివిజన్లలో అభివృద్ధి పనులు చేయడం లేదంటూ రచ్చకెక్కుతున్నారు. డబ్బులిస్తేగాని ఏ పనీ ముందుకు సాగడం లేదని వాపోతున్నారు. ఇలా అధికార పార్టీ కార్పొరేటర్లే పోటాపోటీగా సమావేశాలు నిర్వహిస్తుండటంతో కార్పొరేషన్‌లో ఏం జరుగుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. అధికార పార్టీలోని ఓ వర్గం సమావేశమై కార్పొరేటర్ల ఫోరం ఏర్పాటు చేసింది. ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తూ తన ప్రాబల్యాన్ని చాటుకుంటోంది. దీనికిపోటీగా మూడు రోజుల క్రితం ఎన్టీపీసీలోని ఓ ఫంక్షన్ హాల్‌లో డిప్యూటీ మేయర్ ఆధ్వర్యంలో మరో టీం సమావేశమైంది. రెండువర్గాలోనూ అధికార పార్టీ కార్పొరేటర్లే ఉండడం గమనార్హం. తమ డివిజన్‌లో పనులు కావడం లేదని ఎమ్మెల్యే, మేయర్, డిప్యూటీ మేయర్‌పై అసంతృప్తివాదులు గళం ఎత్తుతున్నారు. మేయర్, డిప్యూటీ మేయర్ కార్యాలయాల్లో అందుబాటులో ఉండటం లేదని, అధికారుల వద్దకు వెళితే తమను పట్టించుకోవడం లేదని కార్పొరేటర్లు వాపోతున్నారు. ప్రతిపక్షాలకు ఉన్న కనీస గౌరవం కూడా అధికార పార్టీ కార్పొరేటర్లకు లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓ వర్గం ఫోరం పేరుతో సమావేశం ఏర్పాటు చేస్తే మేయర్ అనిల్‌కుమార్ ఆ వర్గానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారనే ఆలోచనతో మరోవర్గం కూడా పోటీగా క్యాంపునకు తెరలేపినట్లు తెలుస్తోంది. డివిజన్లలో పనులు కావడం లేదని, అధికారులు ఏమాత్రమూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ క్రమంలోనే వ్యతిరేక రాగం అందుకున్నామని, తిరుగుబాటు కోసమే ఫోరం ఏర్పాటు చేశామని చెబుతున్నారు.

పోటీగా కార్పొరేటర్ల సమావేశం..

కార్పొరేటర్ల ఫోరం పేరుతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేషన్ అధికారులపై ఒత్తిడి పెంచుతున్నారు. ఇదే క్రమంలో తమను ఎక్కడ పలచన చేస్తారోననే ఆలోచనతో మిగితా అధికార పార్టీ కార్పొరేటర్లు ఎన్టీపీసీలోని ఓ ప్రవేట్ ఫంక్షన్ హాల్‌లో సుదీర్ఘంగా సమావేశమై మిగితా కార్పొరేటర్ల మనోగతాన్ని తెలుసుకున్నారు. ఇందులో చాలా మంది మేయర్, అధికారులకు వ్యతిరేకంగా గళమెత్తినట్లు తెలుస్తోంది.

దిద్దుబాటు చర్యల్లో ఎమ్మెల్యే..

అధికార పార్టీ కార్పొరేటర్లు అసమ్మతి గళం ఎత్తడం పార్టీకి ఇబ్బందిగా మారింది. రెండు వర్గాలుగా చీలిపోయి కార్పొరేషన్‌పై దండయాత్ర చేస్తుండటంతో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది. దీనిపై రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ దృష్టి సారించారు. అందరినీ సమావేశపర్చి అసమ్మతివాదులను సంతృప్తి పరిచే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది.

గ్రామీణక్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం



బహుమతులు అందిస్తున్న మంత్రి ఈశ్వర్

ధర్మారం: గ్రామీణ క్రీడాకారులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండలంలోని పెర్కపల్లిలో 15 రోజులపాటు జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనకు మహిళలు కోలాటాలతో స్వాగతం పలికారు. క్రీడాకారులను మంత్రి, ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ పరిచయం చేసుకున్నారు. 48 టీమ్‌లు పాల్గొనగా.. మొదటి బహుమతి కమ్మరిఖాన్‌పేట యూత్ గెలిచి రూ.20,116, ద్వితీయ బహుమతిని పెర్కపల్లి టీమ్ రూ.10,116 అందుకుంది. రాష్ట్రం వచ్చాక తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. పెర్కపల్లి యువకుల కోసం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామన్నారు. సర్పంచ్ మొట్టె లక్ష్మి, ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, వైస్ చైర్మన్ చొప్పరి చంద్రయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు అజ్మీర మల్లేశ్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.

మాట నిలుపుకున్న మంత్రి

మండలంలోని బంజేరుపల్లి బీ తండాకు చెందిన భూక్య సంతోష్‌నాయక్‌కు ట్రైసైకిల్ అందించిన మంత్రి మాట నిలుపుకున్నారు. తాత్కాలిక విద్యుత్ హెల్పర్‌గా పనిచేస్తున్న సంతోష్‌నాయక్ గతేడాది రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఇటీవల గ్రామ పర్యటనకు వచ్చిన మంత్రి ఆయనను పరామర్శించారు. ఆయనకు ట్రైసైకిల్ ఇస్తానని మాట ఇచ్చి ఆదివారం ఇంటికి వెళ్లి అందించారు.

అరవయ్యేళ్ల పాలనలో కాంగ్రెస్ చేసిందేమిటి..?

- మక్కాన్‌కు డిపాజిట్ రానివ్వం
- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



ఆర్థిక సహాయం అందిస్తున్న ఎమ్మెల్యే చందర్

రామగుండం: అరవయ్యేళ్ల పాలనలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు తెలుసని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. సీఎం కేసీఆర్ పాలనలో గోదావరి నది సముద్రాన్ని తలపిస్తోందని అంటున్న కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రచారం చేసుకుంటున్న మక్కాన్‌సింగ్‌ఠాకూర్‌కు రాబోయే ఎన్నికల్లో డిపాజిట్ రాకుండా చేయడమే బీఆర్ఎస్ లక్ష్యమని తెలిపారు. స్థానిక ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో బీపీఎల్ విద్యుత్ కేంద్రం తెరుచుకోలేదన్నారు. శాప్ చైర్మన్‌గా మక్కాన్‌సింగ్ చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలన్నారు. జెన్‌కో స్థలాల్లో నివాసముంటున్న వారికి క్రమబద్ధీకరించలేకపోయారని విమర్శించారు. తాను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పట్టాలు ఇప్పించేందుకు కృషి చేస్తున్నానని వెల్లడించారు. ఆయన ఏనాడూ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండరని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలోనే వృద్ధులు, వికలాంగులు సంతృప్తిగా ఉన్నారని వివరించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన 13వ డివిజన్‌కు చెందిన పబ్బ రాజేందర్ భార్య మమతకు బీఆర్ఎస్ నుంచి విడుదలైన రూ.రెండు లక్షల చెక్కు అందించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అభిషేక్ రావు, కార్పొరేటర్ కన్నూరి సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ 'ఆవో గావ్ చలే'

- కాసులపల్లిలో మెడికల్ క్యాంపు



వైద్యశిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని కాసులపల్లిలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 'ఆవోగావ్ చలే' కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే దాసరి సొంత గ్రామం కాసులపల్లి నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందించారు. రోగులను పరిశీలించి అవసరమైన మందులు ఉచితంగా అందించారు. వైద్యులు వాసుదేవ రెడ్డి, రమాకాంత్, ప్రణీత్, మల్లేశం, రాజు, రాజేందర్, శ్రీకాంత్, రామ్మోహన్, కృష్ణారెడ్డి, మైథిలి, ధర్మేందర్, శ్రీదేవిరెడ్డి, మహేందర్, రాజ్ కుమార్, చందు, దర్మేందర్, మమతారెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు.

విజయ్.. నోరు అదుపులో పెట్టుకో..

- ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఏం చేశావో చెప్పు..
- మేం ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేశాం..
- మున్సిపల్ ఆత్మీయ సమ్మేళనంలో పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

సుల్తానాబాద్: మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి సూచించారు. మండలకేంద్రంలోని ఎస్వీఆర్ గార్డెన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మున్సిపల్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి అనునిత్యం పాటుపడుతున్నానని, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ద్వారా రూ.కోట్లాది నిధులు తెస్తున్నానని, తద్వారా మారుమూల గ్రామాలూ వేగవంతంగా అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. అది చూసి ఓర్వలేక కాంగ్రెస్ నాయకులు విమర్శిస్తున్నారని తెలిపారు. సుల్తానాబాద్ మేజర్ గ్రామపంచాయతీ నుంచి మున్సిపల్ గా మారిన తర్వాత సుమారు రూ.4కోట్లకు పైగా సీసీరోడ్లకు, రూ.6కోట్లు డ్రైనేజీలకు కేటాయించామని తెలిపారు. ఆ పనులు ప్రజల కళ్లముందే ఉన్నాయని వివరించారు. విజయరమణారావుకు కుర్చీ ధ్యాస తప్ప మరొకటి లేదన్నారు. విజయ్ ఎమ్మెల్యేగా పనిచేసినప్పుడు నియోజకవర్గంలో ఎంత అభివృద్ధి చేశారో ప్రజలకు తెలుసన్నారు. రానున్న రోజుల్లో వారే జవాబు చెబుతారని వివరించారు. తొమ్మిదేళ్లలో తాను నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి కనిపించడం లేదా..? అని ప్రశ్నించారు. విద్య, వైద్యం, మౌళిక వసతులకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, రైతుబంధు, ఇన్సూరెన్స్ సౌకర్యంతోపాటు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అందిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, ఏఎంసీ చైర్‌పర్సన్ బుర్ర మౌనిక, కౌన్సిలర్లు గుర్రాల శ్రీనివాస్, గొట్టం లక్ష్మి, అరుణ, తిరుపతి, సంపత్, సాజిత్, దయాకర్, ఎల్లారావు తదితరులు పాల్గొన్నారు.

మొదటి విడత పంట నష్టం విడుదల

- 5,798 మంది రైతులకు పంపిణీ
- వచ్చేనెల ఒకటి లోపు ప్రక్రియ పూర్తి



అకాల వర్షానికి నేలవాలిన మొక్కజొన్న (ఫైల్)

సుల్తానాబాద్: ఇటీవలి అకాలవర్షాలకు మొదటి విడత పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం విడుదలైంది. ఆ సొమ్మును నష్టపోయిన రైతులకు చెక్కుల రూపంలో అందించేందుకు వ్యవసాయ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా మొదటి విడత సుమారు 6,910 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. రెండోవిడత 21,990 ఎకరాల్లో నష్టపోయారు. అయితే మొదటి విడత సమయంలోనే ప్రభుత్వం నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10వేల చొప్పున అందిస్తామని ప్రకటించిన విషయం తెల్సిందే. ఆ లెక్కన జిల్లా రైతులకు రూ.6.91 కోట్లు మంజూరయ్యాయి. వాటిని 5,790 మంది రైతులకు చెక్కుల రూపంలో అందించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి తెలిపారు. ఈ పరిహారం సొమ్మును జూలై ఒకటో తేదీ లోపు రైతులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఏప్రిల్‌లో కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటలను సర్వే చేయించామని, నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందించేలా చూస్తామని వెల్లడించారు.

నేడు జిల్లా వ్యవసాయ అధికారితో 'సాక్షి' ఫోన్‌ఇన్



ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

పెద్దపల్లిరూరల్: వానాకాలం పంట సాగులో రైతులు అనుసరించాల్సిన పద్ధతులు, విత్తన ఎంపిక, విత్తనాలు నాటే సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై రైతుల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేసుకునేందుకు సోమవారం 'సాక్షి' దినపత్రిక ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డితో ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల సరఫరాలపై జిల్లా అధికారితో మాట్లాడొచ్చు. ఇప్పటికీ సరిపడా వానలు పడని కారణంగా రేగడి భూముల్లో విత్తిన పత్తి విత్తనాలు మొలకెత్తుతాయా..? లేదా..? అన్న సందేహాలపై వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలను పాటించిచేలా 'సాక్షి' తనవంతు ప్రోత్సాహాన్ని అందిస్తోంది.

ఫోన్‌ఇన్ కార్యక్రమం :
సోమవారం (జూన్26)

సమయం:
ఉదయం 9.30 - 10.30 గంటల వరకు

సెల్‌నంబర్
7288894479

వ్యవసాయ కళాశాల మంజూరుపై హర్షం



ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, ఇతర నాయకులు

కాల్వశ్రీరాంపూర్: కూనారంలో వ్యవసాయ కళాశాల మంజూరు చేయడంపై ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించారు. కళాశాల మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యే, మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట పీఏసీఎస్ చైర్మన్లు గజవెల్లి పురుషోత్తం, చదువు రాంచంద్రారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గొడుగు రాజ్‌కుమార్, రైతు సమన్వయ సమితి కన్వీనర్ దేవయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

క్లుప్తంగా

తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడి మృతి


రాజమౌళి(ఫైల్)

ఎలిగేడు: మండలంలోని లోకపేట గ్రామానికి చెందిన వెలిచాల రాజమౌళి(55) గీత కార్మికుడు తాటిచెట్టుపై నుంచి కింద పడి మృతిచెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, తోటి గీత కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు గీత కార్మికుడు రాజమౌళి రోజువారిగా కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కి కల్లుగీస్తుండగా మోకు జారడంతో చెట్టుపై నుంచి కిందపడి అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య సుశీల, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు జూలపల్లి పోలీసులు తెలిపారు. బాధితకుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ ప్రభావతి, గీత కార్మికులు, గ్రామస్తులు కోరారు.

వ్యక్తికి గాయాలు

మంథని: ముత్తారం మండలం లక్కారం గ్రామానికి చెందిన సమ్మయ్య అనే వ్యక్తి బైక్ అదుపుతప్పి తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. ఆదివారం సమ్మయ్య తాపీ మేస్త్రీ పనులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ఓడేడు–గోదావరిఖని రహదారిపై వెళ్తుండగా బైక్ అదుపుతప్పి కిందపడడంతో తీవ్రంగా గాయపడడంతో స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తి అదృశ్యం


రాజేందర్

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ అల్లూరుకు చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు గుర్రం రాజయ్యగౌడ్ రెండో కుమారుడు రాజేందర్‌గౌడ్ అదృశ్యమయ్యాడు. రాజేందర్ తండ్రి కథనం ప్రకారం.. రాజేందర్‌కు ఏనిమిదేళ్ల క్రితం మచ్చుపేటకు చెందిన యువతితో వివాహమైంది. కొన్నిరోజులుగా అతడి అత్తామామ, భార్య ఆస్తిపంచాలని గొడవపడుతున్నారు. ఈ విషయమై కొన్నిరోజుల క్రితం పోలీస్‌స్టేషన్‌లో రాజేందర్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులపై కేసు నమోదుచేశారు. పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి రాజేందర్‌కు రావాల్సిన వాటాభూమి, ఇల్లు ఇవ్వాలని తీర్మానించారు. తాము ఒప్పుకున్నప్పటికీ తరచూ గొడవపడుతున్నారు. ఈక్రమంలో ఆదివారం రాజేందర్ ఇంటినుంచి వెళ్లిపోయాడని, బైక్ కవర్‌లో సెల్‌ఫోన్, పర్సు, లేఖ లభించిందన్నారు. తాను చనిపోతున్నానని, ఇందుకు తన అత్తామామలతో పాటు భార్య కారణమని రాసి ఉందని రాజయ్య పోలీసులకు ఫిర్యాదుచేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపారు.

ఎన్టీపీసీలో డైరెక్టర్ల పర్యటన

జ్యోతినగర్: ఎన్టీపీసీలో డైరెక్టర్లు పర్యటించారు. ప్రాజెక్టులోని స్టేజీ–1లో నిర్మిస్తున్న 800 మెగావాట్ల సామర్థ్యం గల యూనిట్లను డైరెక్టర్లు సంగీతవారియర్, విద్యాదర్, జితేందర్ పరిశీలించారు. యూనిట్లను విద్యుత్ ఉత్పత్తి దశలోకి తీసుకొచ్చేందుకు సాధ్యాసాధ్యాలతో పాటు తదితర అంశాలపై ఉన్నతాధికారులతో చర్చించారు.

వ్యక్తిపై కేసు నమోదు

జమ్మికుంట: అకారణంగా దూషించిన వ్యక్తిపై ఎస్సై యూనిస్ అహ్మద్ అలి కేసు నమోదుచేసినట్లు ఆదివారం తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. మండలంలోని బిజిగిరిషరీఫ్ సర్పంచ్ రాసపల్లి సదయ్యను అదే గ్రామానికి చెందిన రాసపల్లి రమేశ్ వారి తల్లితండ్రులకు దళితబంధులో కారు ఇప్పించడంతో తన సోదరుడు కారు నడుపుకుంటున్నాడని దీంతో నాకు నష్టం వాటిల్లిందని సదయ్య ఇంట్లోకి చొరబడి అకారణంగా దూషించాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మల్లన్న భక్తులకు చెట్లే దిక్కు

- షెడ్లు లేక ఇబ్బందులు
- వర్షంలో తడుస్తూ పట్నాలు, బోనాలు
- ఎండలో ఎండుతూ ఇబ్బందులు
- పెరిగిన భక్తులకు అనుగుణంగా సౌకర్యాలు శూన్యం


చెట్లకింద వంటలు చేస్తున్న భక్తులు

ఓదెల: మల్లన్న భక్తులకు చెట్లే దిక్కయ్యాయి. పెద్దపల్లి జిల్లాలోని ప్రముఖ దేవస్థానం ఓదెల మల్లికార్జునస్వామి దర్శనానికి నిత్యం భక్తుల రద్దీ కొనసాగుతుంది. ప్రతీ ఆది, బుధవారాల్లో ఉగాది నుంచి పెద్దపట్నం బ్రహ్మోత్సవాల వరకు మల్లన్న జాతర అత్యంత వైభవంగా సాగుతుంది. ఈ క్రమంలో పెరిగిన రద్దీకి అనుకూలంగా షెడ్లు లేక చెట్లకిందనే భక్తులు దర్శనంతో పాటు పట్నాలు వేసి బోనాలు సమర్పించేంత వరకు కుటుంబసమేతంగా గడపాల్సి వస్తోంది. ప్రస్తుతం ముసురు వర్షాలు కురిస్తే కనీసం మల్లన్నకు బోనాలు కూడా సమర్పించే పరిస్థితి ఉండదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం ఇబ్బందులే...

ఆలయం భక్తులతో కిక్కిరిసిపోతుండడంతో ఒగ్గు పూజారులు ఇబ్బందులు పడుతున్నారు. కేవలం 15 గదులు మాత్రమే ఉండడంతో పెరిగిన భక్తులకు ఏటు సరిపోవడం లేదు. దీంతో మండే ఎండల్లో, ముసురు వర్షాల్లో సైతం మల్లన్న దర్శనం పట్నాలు వేయాల్సివస్తోందని అంటున్నారు. ఎండోమెంట్ శాఖాధికారులు ప్రతి మూడునెలలకోసారి హుండీ డబ్బులు లెక్కిస్తు లక్షల్లో ఆదాయం శాఖకు జమచేస్తున్నారు. కానీ భక్తులకు కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ప్రముఖ కాంట్రాక్టర్ జిన్నా శ్రీనివాస్‌రెడ్డి ఆధునీకరణ పద్ధతుల్లో గెస్ట్‌హౌస్ నిర్మాణానికి రూ.30లక్షలతో పనులు ప్రారంభించారు. ఈక్రమంలో గదుల నిర్మాణాలకు దాతలు ముందుకు రావాలని, అదనపు సౌకర్యాలకు నిధులు మంజూరు చేయాలని భక్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

35 ఏళ్లనుంచి దర్శించుకుంటున్న



ఓదెల మల్లన్న దర్శనానికి 35 ఏళ్ల నుంచి వస్తున్న చెట్లకిందనే ఉండి ఆలయంలో బోనాలు, పట్నాలు పూజలు చేసుకుని వెళ్తున్నం. వర్షంవస్తే ఇబ్బందులు పడుతున్నాం. కోనేరులో చుక్క నీరులేదు. షెడ్లు లేక ఇబ్బంది పడుతున్నాం. భక్తులకు సౌలత్‌లు కల్పించి ఇబ్బందులు తొలగించాలి.

– మబ్బు రాజయ్య, భక్తుడు, అక్కెపల్లి

ఆలయంలో షెడ్లు నిర్మించాలి



ఓదెల మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం షెడ్లు నిర్మించాలి. దూరప్రాంతాల నుంచి వస్తున్న భక్తులకు నీడసౌకర్యం లేక పడరాని ఇబ్బందులు పడుతున్నారు. చాలీచాలని గదులతో ఏటుసరిపోవడం లేదు. షెడ్లనిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలి.

– బజ్జూరి ప్రసాద్, భక్తుడు, పెద్దపల్లి

పట్నాలు వేయలేకపోతున్నాం



ఓదెల మల్లన్న గుడి ఆవరణలో వర్షంలో తడస్తూ ఎండలో ఎండుతూ పట్నాలు వేయలేక పోతున్నాం. 40 ఏళ్ల నుంచి దర్శనానికి వస్తున్నం. సర్కార్ సౌకర్యాలు కల్పిస్తలేదు. కోనేరు షెడ్లు ఏమిలేవు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

– నూనె గంగవ్వ, భక్తురాలు, గంగిపల్లి

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టు నాయకులు

సుల్తానాబాద్: జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వ చీఫ్‌విప్ తానిపర్తి భానుప్రసాద్ రావును కలిసి వినతిపత్రం అందించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. ఎస్సీ,ఎస్టీ ,బీసీ, మైనార్టీలో ఎక్కువమంది నిరుపేద కుటుంబాలకు చెందిన వారే జర్నలిస్టుగా పనిచేస్తున్నారని ,ప్రత్యేక చొరవ తీసుకొని ఇళ్లస్థలాలతో పాటు ఇల్లు నిర్మించేలా చొరవ తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడు విజయకుమార్ కార్యదర్శి సుంక మహేశ్, రాందాస్, వినోద్, గోపి తదితరులు ఉన్నారు. అనంతరం గో సంరక్షణ కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని గో సంరక్షణ సమితి మండల కార్యదర్శి రాందాస్ వినతిపత్రం సమర్పించారు. ఇరువురి సమస్యపై సానుకూలంగా స్పందించి త్వరలో సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు వారుతెలిపారు.

రెండు పార్టీల మధ్య ఫ్లెక్సీల వివాదం!

- మక్కాన్ ఫ్లెక్సీలను తొలగించి బీఆర్‌ఎస్ ఫ్లెక్సీల ఏర్పాటు
- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు


కాంగ్రెస్ ఫ్లెక్సీని కింద పడేసిన దృశ్యం

రామగుండం: పట్టణంలోని ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నేపథ్యంలో పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం, జీరోపాయింట్, అయోధ్యనగర్ కూడళ్లలో ఏర్పాటుచేయగా అప్పటికే కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ ఫ్లెక్సీలు కట్టి ఉన్నాయి. దీంతో వాటిని తొలగించి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ఫ్లెక్సీలు ఏర్పాటుచేసుకున్నారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఈదునూరి హరిప్రసాద్ స్పందిస్తూ ఫ్లెక్సీలను తొలగించిన పారిశుద్ధ్య సిబ్బందిని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆదేశాలతో తొలగించినట్లు పేర్కొనగా ఇదే విషయమై కమిషనర్ సుమన్‌రావును కాంగ్రెస్ ప్రతినిధులు ఫ్లెక్సీల తొలగింపుపై వివరణ కోరారు. పారిశుద్ధ్య సిబ్బందికి కొన్నిరోజుల క్రితమే అన్ని పార్టీల ఫ్లెక్సీలు తొలగించాలని ఆదేశించామని ఈ రోజు తొలగించడం వివాదాస్పదంగా మారిందన్నారు. కాగా ఆదివారం ఫ్లెక్సీలను తొలగించాలని తాను ఆదేశించలేదని, తమకు ఏ రాజకీయ పార్టీలతో సంబంధం లేదని సమాధానమివ్వడంతో కాంగ్రెస్ శ్రేణులు శాంతించారు. ఫ్లెక్సీల తొలగింపుపై రాబోయే రోజుల్లో అధికారులు రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు.

అర్ధరాత్రి వీధుల్లో తిరిగే ఆకతాయిలపై కఠిన చర్యలు

గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు


యువకులతో మాట్లాడుతున్న సీఐ ప్రమోద్‌రావు

గోదావరిఖని: అర్ధరాత్రి అనవసరంగా వీధుల్లో తిరిగి ప్రజలను ఇబ్బందులకు గురిచేసే ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకుంటామని గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు హెచ్చరించారు. శనివారం అర్ధరాత్రి ఆపరేషన్ చబుత్రా కార్యక్రమాన్ని నిర్వహించి అనుమానితులను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించారు. బైక్‌పై పెట్రోలింగ్ చేస్తూ రాత్రివేళల్లో ప్రధాన కూడళ్లు, వీధులు, రోడ్లపై గుంపులుగా జులాయిగా తిరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న 68 మందిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. పట్టుబడిన వారిపై పెట్టీ కేసులు నమోదు చేసి, కౌన్సెలింగ్ నిర్వహించారు. రాత్రి పది తర్వాత ఎవరైనా యువకులు రోడ్లపై విన్యాసాలు చేస్తూ గుంపులుగా కనపడితే వాహనాలు సీజ్‌చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పోలీసులకు పట్టుబడిన వారి తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ సూచించారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా లక్ష్యం దిశగా కష్టపడి ముందుకెళ్లాలన్నారు. ఆపరేషన్ చబుత్రాలో వన్‌టౌన్ రెండో సీఐ ప్రమోదర్‌రావు, టూటౌన్ సీఐ వేణుగోపాల్, సిబ్బంది పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ పుస్తకాల గది సీజ్



నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతున్న పుస్తకాలు, సీజ్ అయిన బుక్‌స్టాల్ గది

గోదావరిఖనిటౌన్: స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్ముతుండడంతో విద్యాశాఖ అధికారులు పుస్తకాల గదిని సీజ్ చేసినట్లు ఏబీవీపీ నగరకార్యదర్శి సిద్ధార్థ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా పాఠ్యపుస్తకాలు, యూనిఫార్మ్, స్టేషనరీలు అధిక ధరలకు అమ్ముతున్నారని సమాచారం అందించడంతో బుక్ స్టాల్‌ని విద్యాశాఖ అధికారులు సీజ్‌చేశారన్నారు. ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, స్టేషనరీల పేరుతో వేలాది రూపాయలు దోచుకుంటు విద్యార్థుల తల్లిదండ్రులను తీవ్ర ఆర్థిక దోపిడీకి గురిచేస్తున్నాయన్నారు. అనుమతులు లేకుండా పాఠశాలలు, పుస్తకాలు అమ్ముతున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని గుర్తింపు రద్దుచేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

తల్లీకుమారుడి అదృశ్యం

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): తల్లీ కుమారుడు అదృశ్యమైన ఘటన మండలంలోని బుగ్గ రాజేశ్వరతండాలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన గుగులోతు మేరీ (28) చిన్న కుమారుడు శివాన్స్‌తో కలిసి తల్లిగారి ఇల్లు అయిన రాచర్ల గుండారం గ్రామానికి వెళ్తున్నానని చెప్పగా భర్త అనిల్ ఎల్లారెడ్డిపేట బస్టాండ్‌లో శనివారం కామారెడ్డి డిపో బస్సు ఎక్కించాడు. ఆది వారం ఫోన్‌చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో అనుమానం వచ్చి గుండారంలోని అత్తగారింటికి ఫోన్ చేశాడు. అక్కడికీ రాలేదని వారు తెలపడం, బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో అనిల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

దాతలసాయంతో అంత్యక్రియలు పూర్తి

తంగళ్లపల్లి (సిరిసిల్ల): మండలంలోని బస్వాపూర్‌కు చెందిన గొడిసెల దేవయ్య (45) శనివారం సాయంత్రం గ్రామశివారులోని కల్వర్టు వద్ద కారు ఢీకొనడంతో మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు పట్టుబట్టడంతో పోస్టుమార్టం కూడా ఆలస్యంగా నిర్వహించారు. మద్యం మత్తులో కారు నడిపిన వ్యక్తికి చెందినవారు మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు. నిరుపేద కుటుంబం కావడంతో గ్రామస్తులు చందాలు పోగుచేశారు. జెడ్పీటీసీ పూర్మాణి మంజుల రాంలింగారెడ్డి దంపతులు రూ.5,016 తోపాటు దాతల సాయంతో అంత్యక్రియలు నిర్వహించారు. కాగా ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై ఇప్పటికే తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

- విరాళాలతో అంత్యక్రియలు


కట్ట రమేశ్(ఫైల్)

కరీంనగర్‌రూరల్: అనారోగ్యంతో మృతిచెందిన ఓ వ్యక్తి అంత్యక్రియలు నిర్వహించలేని దీనస్థితిలో కుటుంబసభ్యులుండగా యువకులు స్పందించి విరాళాలు సేకరించారు. నగదును కుటుంబ సభ్యులకు అందించి మానవత్వం చాటుకున్నారు. మిగిలిన గ్రామాల ఆదర్శంగా నిలిచారు. కరీంనగర్ మండలం దుర్శేడ్‌కు చెందిన స్వర్ణకారుడు కట్ట రమేశ్(58) వృత్తి పనులు సక్రమంగా సాగక మెట్‌పల్లిలోని కోళ్లఫారంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఆరునెలలుగా అనారోగ్యంతో ఇంటివద్దే ఉంటున్నాడు. ఈక్రమంలో ఆదివారం ఆకస్మికంగా మృతిచెందాడు. భార్య నిర్మల గృహిణికాగా కుమారుడు సూరజ్, కుమార్తె సుచితలున్నారు. అయితే అంత్యక్రియలు నిర్వహించలేని కడు పేదరికంలో కుటుంబం ఉండగా గ్రామంలోని యువత స్పందించి వాట్సాప్ గ్రూప్‌లో పోస్టుచేయడంతో స్పందించిన యువత విరాళాలు ప్రకటించారు. ఉపసర్పంచ్ సంపత్‌రావు ఆధ్వర్యంలో యువకులు రూ. 10వేల ఆర్థికసాయాన్ని మృతుడి కుటుంబానికి అందించగా అంత్యక్రియలు నిర్వహించారు. నిరుపేద అంత్యక్రియలకు విరాళాలను అందించి మానవత్వం ప్రదర్శించిన యువకులను స్థానిక ప్రజాప్రతినిధులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని మండెపల్లి–రాళ్లపేట గ్రామ శివారు మూలమలుపు వద్ద ఆదివారం ఆటో, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓబులాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ తనద్విచక్ర వాహనంపై మండెపల్లి వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో చంద్రంపేటకు చెందిన రాజు, స్వరూప ప్యాసింజర్ ఆటోలో ఓబులాపూర్‌కు వెళ్తుండగా మూలమలుపు వద్ద రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ రాజు (45), ప్రయాణికురాలు స్వరూప (25)కు తీవ్ర గాయాలుకాగా శ్రీనివాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కిడ్నీ సంబంధిత వ్యాధితో వ్యక్తి మృతి

వీర్నపల్లి: మండలంలోని రంగంపేట గ్రామానికి చెందిన కుమ్మరి మహేశ్ (35) కిడ్నీ సంబంధిత వ్యాధితో మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్ గ్రామంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, చెప్పుల దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య రమ్య, కుమారులు అరవింద్, రాకేష్, కూతుళ్లు శ్రావణి, హిమబిందు, జున్ను , ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచ్ నందగిరి లింగం అన్నారు.

లారీ ట్రాన్స్‌పోర్టు సమస్యలు పరిష్కరిస్తా

- డీసీసీ అధ్యక్షులు ఎంఎస్ రాజ్‌ఠాగూర్



కార్యాలయం ప్రారంభిస్తున్న ఎంఎస్ రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: లారీ ట్రాన్స్‌పోర్ట్ సమస్యలు పరిష్కరిస్తానని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గంగానగర్‌లోని లారీ అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. రాబోయే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే లారీ పార్కింగ్ సమస్యలు పరిష్కరిస్తానన్నారు. త్వరలోనే లారీ అసోసియేషన్ ఓనర్స్‌అండ్ డ్రైవర్లకు ఇన్సూరెన్స్ ఏర్పాటుచేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు మహమ్మద్ రషీద్, ప్రధానకార్యదర్శి పీనాస్, ఉపాధ్యక్షుడు డేవిడ్, మోసిన్, సయ్యద్‌ఫాజిల్, రమణ, ఖలీల్, కాంగ్రెస్ నాయకులు మహంకాళిస్వామి, ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉదయం స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో వాకర్స్‌తో కలిసి వాకింగ్ చేశారు. వారి సమస్యలు తెలుసుకున్నారు.

ఏసీ తరలించిన అధికారి బదిలీ

గోదావరిఖని: సొంతింటి కోసం ఆఫీస్‌లోని ఏసీని తరలించిన సింగరేణి అధికారిని బదిలీచేస్తూ యాజమాన్యం ఆదేశాలు జారీచేసింది. సంస్థకు చెందిన ఏసీని సొంతింటి కోసం తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు పట్టుకున్న విషయం విధితమే. ఈక్రమంలో లోతుగా విచారణ కొనసాగుతోంది. ఏసీని తరలించిన వాహనం డ్రైవర్, ఏసీని రిమూవ్, ఫిట్‌చేసిన టెక్నీషియన్ సహకరించిన వారి వాయిస్ వీడియో రికార్డింగ్ చేసిన విజిలెన్స్ అధికారులు నివేదిక సిద్ధం చేసినట్లు సమాచారం. వీటితో పాటు పలు మారుపేర్లతో అద్దె ట్రాక్టర్లు కూడా కొనసాగిస్తున్నట్లుగా విచారణలో బయటపడినట్లు తెలుస్తోంది. విజిలెన్స్ విచారణ కొనసాగుతున్న క్రమంలోనే అధికారిని బదిలీచేసింది. నివేదికను త్వరలో కార్పొరేట్ కార్యాలయానికి నివేదించనున్నట్లుగా తెలుస్తోంది.

పెద్దమ్మతల్లికి బోనాలు



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలో ఆదివారం ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మతల్లికి బోనాలు చేశారు. మహిళలంతా బోనాలతో ఆలయానికి చేరుకుని మొక్కులు సమర్పించుకున్నారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి బోనం ఎత్తుకుని ప్రదర్శనలో ముందుకు సాగారు. అలాగే మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, ముదిరాజ్ సంఘ జిల్లా అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య, కౌన్సిలర్లు కొలిపాక శ్రీనివాస్, నాయకులు నర్సింగం, శ్రీనివాస్, సంపత్ తదితరులున్నారు.



సుభాష్‌నగర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం

పట్టణంలోని సుభాష్‌నగర్‌లో ఆదివారం బొడ్రాయి విగ్రహప్రతిష్ఠాపనోత్సవాలు జరిగాయి. కాలనీ వాసులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ చిరుమిల్ల రాకేశ్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.